నిబంధనల ప్రకారం లేకుంటే నా ఇంటిని కూల్చేయండి: తిరుపతి రెడ్డి 2లో

తెలుగు దినపత్రిక
# డైలీ రిపోర్ట్
DAILY REPORT
ఎడిటర్: బక్క రవీందర్
శుక్రవారం 30, ఆగస్టు 2024

సమస్య ఏదైనా
దాని వెనుక ఎవరున్నా...
నిజాన్ని నిర్భయంగా చూపిస్తాం
మీకు తెలిసిన ప్రజల సమస్యలు
మాకు తెలియజేయండి.
ఇండిపెండెంట్ జర్నలిజానికి
వేదిక.. మీ డైలీ రిపోర్ట్
ఫోన్ నెంబర్
8501919707

# హైదరాబాద్ ఇమేజ్‌ను పెంచేలా గణేష్ ఉత్సవాలు

హైదరాబాద్: హైదరాబాద్ ఇమేజ్‌ను మరింత పెంచేలా గణేష్ ఉత్సవాల నిర్వహణ ఉండాలని, ఇందుకోసం ఉత్సవ కమిటీలు, మండప నిర్వాహకులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. మండపాల ఏర్పాటు, తొమ్మిది రోజుల ఉత్సవాల నిర్వహణ, నిమజ్జనానికి సంబంధించి మండప నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

అధికారులు, మండప నిర్వాహకులు సమన్వయంతో ముందుకు సాగాలి ప్రభుత్వం తరపున పోలీసు, జీహెచ్ఎంసీ, ఆర్ అండ్ బీ, నీటి పారుదల శాఖ, విద్యుత్ శాఖతో పాటు ఇతర ముఖ్య శాఖల అధికారులు సైతం మండప నిర్వాహకులతో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. ఎక్కడ ఎటువంటి లోటుపాట్లకు తావివ్వద్దని హెచ్చరించారు. జోన్ల వారీగా ఉన్నతాధికారులకు బాధ్యతలు అప్పగించాలని, ఉత్సవ కమిటీ సభ్యులు, మండప నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ శాంతియుతంగా ఉత్సవాలు, నిమజ్జనం కొనసాగేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. %ఏ అధికారి ఏ జోన్‌లో బాధ్యతల్లో ఉన్నారు.. ఆయా ప్రాంతాల్లో ఉత్సవ కమిటీ ప్రముఖులు, మండపాల బాధ్యులు అన్నింటి వివరాలు సమగ్రంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో గతేడాది 1.50 లక్షల విగ్రహాలు ఏర్పాటు చేశారనే లెక్కలున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. ముందుగా మండప నిర్వాహకులు ఆన్‌లైన్‌లో, ఆఫ్‌లైన్‌లోనో అనుమతులు తీసుకోవాలని, అలా తీసుకోవడం వలన ఆయా ప్రాంతాల్లో భద్రత, ట్రాఫిక్ ఇతర ఇబ్బందులు తలెత్తకుండా చూసుకునే అవకాశం ఉంటుందన్నారు. మొత్తం విగ్రహాలను హుస్సేన్ సాగర్‌కే కాకుండా ఇతర చెరువుల్లోనూ నిమజ్జనం చేసే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు.

సరూర్ నగర్‌తో పాటు పలు చెరువులు నీటితో ఉన్నాయని, ఏ ప్రాంతంలోని విగ్రహాలు ఆ ప్రాంతంలోని చెరువుల్లో నిమజ్జనం చేస్తే హుస్సేన్ సాగర్ వద్ద రద్దీ తగ్గడంతో పాటు ఆయా చెరువుల వద్ద నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లను ప్రభుత్వం ముందుగానే చేసే వీలుంటుందన్నారు. ఈ విషయంలో ఉత్సవ సమితి సభ్యులు, మండప నిర్వాహకులు ముందగానే సమాచారం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. నిమజ్జనానికి ముఖ్య అతిథులుగా ఎవరినైనా పిలిస్తే ముందుగానే ప్రభుత్వానికి సమాచారం ఇవ్వాలని, అలాగే వీవీఐపీలు ఎవరైనా వచ్చే అవకాశం ఉంటే ముందుగా తెలియజేస్తే పోలీసు శాఖ వారి రాకపోకలకు రూట్ క్లియరెన్స్ చేయడంతో పాటు తగిన భద్రత ఏర్పాటు చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నిమజ్జన ఊరేగింపు త్వరగా ప్రారంభిస్తే త్వరగా కార్యక్రమాన్ని ముగించుకోవచ్చని, ఫలితంగా భక్తులు ట్రాఫిక్, ఇతర ఇబ్బందులు బారిన పడకుండా చూసుకోవచ్చన్నారు. ఉత్సవాల నిర్వహణకు సంబంధించి నగరం పరిధిలోని నలుగురు లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేల అభిప్రాయాలను



తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసులను ఆదేశించారు. సెప్టెంబరు 16న మిలాద్ ఉన్ నబి, 17న తెలంగాణలో వివిధ రాజకీయ పార్టీలు పలు కార్యక్రమాలు చేపడతాయని, అందువలన అన్ని కార్యక్రమాలకు సక్రమమైన ప్రణాళికతో ముందుకు సాగాలని, ఎక్కడా ఎటువంటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని పోలీసులను ముఖ్యమంత్రి ఆదేశించారు.

**అనుమతులు తీసుకున్న మండపాలకు ఉచిత విద్యుత్**

గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. అందుకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. ముందుగా మండప నిర్వాహకులు ఉచిత విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనుమతులు లేకుండా విద్యుత్ వినియోగిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని, జవాబుదారీతనం కోసమే అనుమతి చేసుకోవాలని కోరుతున్నామని తెలిపారు. నిమజ్జనం రోజైన సెప్టెంబరు 17వ తేదీన అనంత చతుర్దశి వచ్చిందని, ఆ తేదీ ప్రాముఖ్యతను తెలుపుతూ దేవాదాయ శాఖ తరపున పర్వదిన ప్రాముఖ్యతను తెలిపే సాహిత్యాన్ని ప్రచురించాలని, ప్రచారం చేయాలని భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు జి.రాఘవరెడ్డి ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావును ముఖ్యమంత్రి ఆదేశించారు.

**సుప్రీంకోర్టు నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలి**

%మండపాల్లో డీజేలు వాడేందుకు అనుమతి ఇవ్వాలని రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు నిబంధనల ప్రకారం ముందుకు వెళతామని ముఖ్యమంత్రి తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి పర్యావరణ హిత (ఈకో ఫ్రెండ్లీ) విగ్రహాలు ప్రతిష్టించాలని మంత్రి శ్రీధర్ బాబు ఉత్సవ సమితి నిర్వాహకులకు సూచించారు. గణేష్ ఉత్సవాలకు సంబంధించి ఇప్పటి వరకు చేప్టటిన సమావేశాలు, ఉత్సవ సమితి సభ్యులు చేసిన సూచనలు, పరిష్కరించిన సమస్యల వివరాలను మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. మొత్తంగా 25 వేల మందితో భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు డీజీపీ జితేందర్, హైదరాబాద్ సిటీ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అన్ని శాఖలతోనూ సమన్వయం చేసుకుంటున్నామని వారు చెప్పారు. ఉత్సవాల్లో మట్టి విగ్రహాలు వాడేలా చూడాలని, మద్యం తాగి ఇబ్బంది పెట్టే వారి విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ ఏ.వి.ఎన్.రెడ్డి కోరారు. సమావేశంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు కేశవరావు, షబ్బీర్ అలీ, ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మేయర్ గద్వాల విజయలక్ష్మి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, అన్ని శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైడ్రా పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న అధికారులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గట్టి వార్నింగ్ ఇచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ... హైడ్రా పేరుతో కొంతమంది అధికారులు సామాన్యులను బెదిరింపులకు గురి చేస్తున్నట్లుగా ఫిర్యాదులు అందాయన్నారు. మున్సిపల్, రెవెన్యూ అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లుగా తన దృష్టికి వచ్చిందన్నారు.

గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డం పెట్టుకొని బెదిరిస్తున్నట్లుగా తెలిసిందన్నారు. అలాంటి వారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమాయకులను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. హైడ్రా పేరుతో వసూళ్లకు పాల్పడే వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏసీబీ, విజిలెన్స్‌కు ఆదేశాలు జారీ చేశారు.

# ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేయాలి ..

**సీఎస్‌లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో ప్రధాని మోదీ**

**జాతీయ ప్రాజెక్టులపై ప్రధాని మోదీ సమీక్ష**

**జల్ జీవన్ మిషన్, గ్యాస్ పైప్ లైన్, రైల్వే ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**





జల్ జీవన్ మిషన్ పథకం కింద ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించేందుకు నిర్దేశించిన పథకాలతో పాటు ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు సూచించారు. తాగునీరు, జల్ జీవన్ మిషన్, పారిశుద్ధ్యం, జాతీయ రహదారులు, గ్యాస్ పైపులైన్ల నిర్మాణం, రైల్వే ప్రాజెక్టులు, అమృత్ -2.0 వంటి ప్రగతి అంశాలపై బుధవారం ఢిల్లీ నుండి వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో ప్రధాని నరేంద్ర మోదీ వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. పారిశుద్ధ్య నిర్వహణ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పలు రైల్వే, రోడ్డు ప్రాజెక్టులు, నూతన పైపులైను నిర్మాణ ప్రాజెక్టులను కూడా సకాలంలో

మిగతా 2లో

# పేదల జోలికొస్తే సహించేది లేదు:ఈటల రాజేందర్



హైదరాబాద్: అక్రమ కట్టడాల పేరుతో పేదలకు ఇచ్చిన నోటీసులను ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపి ఈటల రాజేందర్ విజ్ఞప్తి చేశారు. గురువారం నాడిక్కడ మీడియాతో మాట్లాడిన ఈటల పేదల ఇళ్ల జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. అక్రమాలు చేసి నిర్మించిన బడా బాబుల నివాసాలు, నిర్మాణాలు కూల్చి వేస్తే ఫర్వాలేదని అదే పేదలు తమ కష్టార్జితంతో చేపట్టిన నిర్మాణాలను అక్రమ కట్టడాల పేరుతో తొలగిస్తే ఊరుకునేది లేదని అన్నారు. చెరువుల్లో పట్టా భూములు ఉంటే పేద ప్రజలకు ప్రత్యామ్నాయం చూపించాలని డిమాండ్ చేశారు. అంతేగానీ చెరువుల్లో నిర్మాణాలు ఉన్నాయని కూలగొట్టడం మంచిదికాదని హితవు పలికారు. అలాగే పేదలకు ఇచ్చిన నోటీసులను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేదంటే సీఎం రేవంత్ సంగతి చూస్తామని ఎంపీ ఈటల ఘాటుగా వ్యాఖ్యానించారు. మీకు తెలిసిందల్లా ఒక ఎన్ కన్వెన్షన్ కూల్చివేత మాత్రమే. కానీ హస్మత్‌పేట్, అల్వాల్, సరూర్ నగర్, సఫిల్‌గూడ చెరువుల సమీపంలో వందలాది పేద కుటుంబాల కన్నీళ్ల బాధ ఎవరికీ తెలియడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హస్మత్‌పేట్ చెరువు వద్ద 125 కుటుంబాలు, అల్వాల్ చెరువు వద్ద 120 కుటుంబాలు 1985లో పొట్ట చేత పట్టుకొని వచ్చి ఇక్కడ 60 లేదా 40 గజాల భూమిని కొనుక్కున్నారన్నారు. ఈ కుటుంబాల వారు ధనవంతులు కాదని, కడు పేదవారు అన్నారు. గతంలోనూ సీఎంలు చెరువుల అభివృద్ధి కోసం పని చేశారని చెబుతూ రేవంత్ రెడ్డి మాత్రం ఈరోజే రాష్ట్రం ఏర్పడినట్లు వారే చెరువులను కాపాడుతున్నట్లుగా చేస్తుండటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. నోటీసులు రావడంతో ఇప్పుడు ఆ పేద కుటుంబాలకు కంటిమీద కునుకు లేకుండా పోయిందన్నారు. వారు కార్పొరేటర్, ఎమ్మెల్యే, ఎంపీల వద్దకు పరుగులు పెడుతున్నారన్నారు. ఇది పార్టీలకు సంబంధించిన పంచాయతీ కాదని, పేదవాళ్ల పంచాయతీ అన్నారు. హైడ్రా పేరుతో మీరు ఏం చేస్తున్నారో తనకు తెలియదని, కానీ ఇదో డ్రామా అని ముందే చెప్పానని అన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లు, గుడిసెలు కూల్చివేస్తే ఖబడ్దార్ అని గతంలోనే హెచ్చరించానని గుర్తు చేశారు.

# కన్న బిడ్డను చూడగానే భావోద్వేగానికి గురైన కెసిఆర్

సిద్దిపేట: ఎర్రవెల్లిలో ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్ రావు నివాసానికి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేరుకున్నారు. కవిత తన భర్త, కుమారునితో కలిసి వచ్చిన ఆడబిడ్డకు పుట్టినింటిలో ఆత్మీయంగా ఆహ్వానించారు. సిబ్బంది కవితకు దిష్టి తీసి స్వాగతం పలికారు. కన్న బిడ్డను చూడగానే తండ్రి కెసిఆర్ భావోద్వేగానికి గురయ్యారు. అక్రమ నిర్బంధం నుంచి బయటకొచ్చిన బిడ్డను చూసి కెసిఆర్ కండ్లల్లో ఆత్మీయ ఆనందం కనపడింది. తండ్రి పాదాలకు తనయురాలు నమస్కరించారు. బిడ్డను ఆప్యాయంగా అక్కున చేర్చుకుని ఆశీర్వదించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత తీహార్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎంఎల్‌సి కవితను ఇడి ఈ ఏడాది మార్చి 15న హైదరాబాద్‌లో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో మార్చి 26న కోర్టు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. అప్పటి నుంచి జ్యుడీషియల్ కస్టడీపై తిహార్ జైలులో ఉన్నారు. మంగళవారం సర్వోన్నత న్యాయస్థానం ఇడి, సిబిఐ కేసుల్లో కవితకు బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత బెయిల్ ఉత్తర్వు కాపీలను న్యాయవాదులు తిహార్ జైలు అధికారులకు అందించారు. 164 రోజుల తర్వాత మంగళవారం జైలు నుంచి విడుదల అయ్యారు.



# డాక్టర్లను బెదిరించలేదు : మమత బెనర్జీ

కోల్‌కతా: వైద్యవిద్యార్థిని హత్యాచారంపై గత 21 రోజులుగా విధుల్ని బహిష్కరించి ఆందోళన సాగిస్తున్న జూనియర్ డాక్టర్లపై తాను ఎలాంటి బెదిరింపులకు పాల్పడలేదని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లను తాను బెదిరించినట్టు కొన్ని వర్గాల నుంచి ఆరోపణలు వస్తున్నాయని, అవి పూర్తిగా అవాస్తవమని బెనర్జీ పేర్కొన్నారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో వివరణ ఇచ్చారు. " మెడికోలు, జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆందోళనలకు వ్యతిరేకంగా తానొక్క మాటా అనలేదు. నేను వారికి పూర్తిగా మద్దతు ఇస్తున్నా. వారిని బెదిరించలేదు. కొంతమంది నాపై ఆరోపణలు చేస్తున్నారు. అవన్నీ అవాస్తవం" అని ఆమె వివరించారు. తృణమూల్ కాంగ్రెస్ ఛాత్ర పరిషత్ (విద్యార్థి విభాగం) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన ర్యాలీలో మమతా బెనర్జీ ప్రసంగించారు. జూనియర్ డాక్టర్లు తమ ఆందోళన విరమించి వెంటనే విధుల్లోకి హాజరు కావాలని కోరారు. సమ్మె చేస్తున్న డాక్టర్ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని వారిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం తనకు ఇష్టం లేదని సూచించారు. అయితే ఈ వ్యాఖ్యలను పరోక్ష బెదిరింపుగా డాక్టర్లు భావించి విధుల్లోకి చేరడానికి తిరస్కరించారు. బెనర్జీ ఇంకా " బీజేపీకి వ్యతిరేకంగా నేను మాట్లాడాను, ఎందుకంటే కేంద్ర ప్రభుత్వ మద్దతుతో డాక్టర్లు రాష్ట్రం లోని ప్రజాస్వామ్యాన్నే బెదిరిస్తున్నారు. అరాచకాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారు.



# ప్రాజెక్టులు వేగవంతంగా పూర్తి చేయాలి ..

పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రధాని సిఎస్‌లను ఆదేశించారు. అటల్ మిషన్ ఫర్ రెజువనేషన్ అండ్ అర్బన్ ట్రాన్స్‌ఫర్మేషన్ 2.0 (అమృత్ 2.0)కింద పట్టణాల్లోని ప్రతి ఇంటికి సురక్షిత తాగునీటి సౌకర్యాన్ని కల్పించడం, సీవరేజ్ ట్రీట్మెంట్ ప్రాజెక్టులు, తాగునీటి వనరుల చుట్టూ పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ప్రధాని ఆదేశించారు.

ఇస్లామాబాద్‌లో సదస్సుకు మోడీ రావాలి.. పాకిస్తాన్ ఆహ్వానం

అక్టోబర్‌లో నిర్వహించనున్న షాంఘై సహకార సంఘం(ఎస్‌సిఓ) ప్రభుత్వాధినేతల సమావేశానికి భారత ప్రధాని నరేంద్ర మోడీని పాకిస్తాన్ ఆహ్వానించింది. ఈ విషయాన్ని పాక్ విదేశాంగ కార్యాలయ అధికార ప్రతినిధి గురువారం నాడిక్కడ వెల్లడించారు. అక్టోబర్ 15-16 తేదీలలో జరిగే ఎస్‌సిఓ సమావేశంలో పాల్గొనవలసిందిగా కోరుతూ సభ్యదేశాల ప్రభుత్వాధినేతలకు ఆహ్వానాలు పంపినట్లు అధికార ప్రతినిధి ముంతాజ్ జహ్రా బలూచ్ విలేకరులకు తెలిపారు. భారత ప్రధాని నరేంద్ర మోడీకి కూడా ఆహ్వానం పంపినట్లు ఆమె తెలిపారు. ఎస్‌సిఓ ప్రభుత్వాధినేత సమావేశంలో పాల్గొనడంపై కొన్ని దేశాలు ఇప్పటికే తమ సమ్మతిని తెలియచేశాయని ఆమె తెలిపారు. ఏఏ దేశాల నుంచి సమ్మతి వచ్చిందో త్వరలోనే తెలియచేస్తామని ఆమె వివరించారు.కాగా..భారత్, పాకిస్తాన్ మధ్య సుదీర్ఘకాలంగా సత్సంబంధాలు కరువయ్యాయి. ప్రధానంగా కశ్మీరు సమస్యతోపాటు పాకిస్తాన్ నుంచి ఎదురవుతున్న సీమాంతర ఉగ్రవాదంపై రెండు దేశాల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. ఎస్‌సిఓ సమావేశానికి ముందు మంత్రిత్వ స్థాయిలో సమావేశాలు జరుగుతాయి. ఆర్థిక, సామాజిక, సాంస్కృతి, మానవతాపరమైన సహకారం తదితర అంశాలపై సీనియర్ అధికారుల సమావేశాలు జరుగుతాయి. ఎస్‌సిఓలో భారత్, చైనా, రష్యా, పాకిస్తాన్, కజఖస్తాన్, కిర్గిజ్‌స్తాన్, తజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్ సభ్యులుగా ఉన్నాయి. భారత్‌తో సంబంధాల గురించి ఒక విలేకరి ప్రశ్నించగా భారత్‌తో పాకిస్తాన్‌కు ప్రత్యక్ష ద్వైపాక్షిక వాణిజ్యం లేదని అధికార ప్రతినిధి తెలిపారు. 2019 ఆగస్టు 5న భారత ప్రభుత్వం కశ్మీరులో 370వ అధికరణను రద్దు చేసిన తర్వాత భారత్‌తో తన సంబంధాలను పాకిస్తాన్ పూర్తిగా తగ్గించుకుంది.

# సిఎం రేవంత్‌రెడ్డి రైతులనే కాదు..రాహుల్ గాంధీని కూడా మోసం చేస్తున్నారు:హరీశ్‌రావు



హైదరాబాద్: రుణమాఫీ చేయకుండా ప్రజలను సిఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్‌రావు విమర్శించారు. రుణమాఫీ పూర్తి కాలేదని మంత్రులే చెబుతున్నారని, వ్యవసాయశాఖ మంత్రి లెక్కల ప్రకారం 22 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలేదని చెప్పారు. రైతులనే కాదు, రాహుల్‌గాంధీని కూడా రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మీడియాతో సిఎం చేసేది చిట్‌చాట్ కాదు అని, చీట్ చాట్ అని విమర్శించారు. రుణమాఫీ విషయంలో రేవంత్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది అని పేర్కొన్నారు. రుణమాఫీ చేయని గజ దొంగవి నువ్వు.. నన్ను దొంగ అంటావా..అంటూ సిఎం రేవంత్‌పై మండిపడ్డారు. రుణమాఫీ పాక్షికంగా జరిగిందని మంత్రి ఉత్తమ్ చెప్పారు కదా అని గుర్తు చేశారు. వ్యవసాయ, రెవెన్యూ మంత్రులు కూడా రుణమాఫీ కాలేదని చెప్పిన విషయాన్ని హరీష్ రావు ప్రస్తావించారు. తెలంగాణ భవన్‌లో గురువారం బిఆర్‌ఎస్ ఎంఎల్‌ఎ హరీశ్‌రావు మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఫోర్త్ సిటీ పేరుతో ప్రభుత్వ భూములు కొల్లగొట్టే కుట్ర జరుగుతోందని హరీశ్‌రావు ఆరోపించారు.సమయం వచ్చినప్పుడు అన్ని వివరాలను బయటపెడతామన్నారు. కందుకూరు రెవెన్యూ పరిధిలో సర్వే నెంబర్ 9లో 385 ఎకరాల భూమిని కాజేసేందుకు కుట్ర జరుగుతోందని పేర్కొన్నారు. అలాగే తుక్కుగూడ పరిధిలోని సర్వే నెంబర్ 895లో 25 ఎకరాల పేద రైతుల భూములు బినామీల పేరు మీదకు మారుతున్నాయని ఆరోపించారు. ముచ్చర్లలో సిఎం తమ్ముళ్ల పిఎల పేర్ల మీద కూడా భూములు కొంటున్నారని అన్నారు. సిఎం సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో బిజెపి అభ్యర్థి అరుణను గెలిపించారని అన్నారు. సిఎం సొంత నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎంపి అభ్యర్థికి ఎందుకు మెజారిటీ తగ్గిందని ప్రశ్నించారు. ప్రధాని మోదీ మెప్పు కోసమే రేవంత్ రెడ్డి దగ్గరుండి బిజెపికి ఓట్లు వేయించారని ఆరోపించారు. ముందు మహేందర్ రెడ్డి, గుత్తా అమిత్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసి ఆ తరువాత తమను అడగాలని హరీశ్‌రావు అన్నారు. ఆగస్టు 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నది తన సవాల్ అని, ఆ గడువులోగా చేశారా..? అని హరీశ్‌రావు నిలదీశారు. రుణమాఫీ సవాల్ ఏమైందో రైతులే చెబుతారని పేర్కొన్నారు. రుణమాఫీ సభకు రావాలని సిఎం మూడుసార్లు ఆహ్వానించినా రాహుల్‌గాంధీ రాలేదు అని పేర్కొన్నారు.ఓటుకు నోటులో రూ. 50 లక్షలు ఇస్తూ దొరికిన దొంగవు నువ్వు. నన్ను దొంగ అంటావా..? అంటూ సిఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. వాల్మీకి స్కామ్ పట్ట పగలు నిలువు దోపిడీ లాంటిదని విమర్శించారు. తెలంగాణ కాంగ్రెస్, తెలంగాణ బిజెపి భాయి భాయి అన్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. అందుకే వాల్మీకి స్కామ్‌పై తెలంగాణలో విచారణ జరగడం లేదన్నారు. వాల్మీకి స్కామ్‌పై రాహుల్ గాంధీ ఎందుకు మాట్లాడటం లేదని హరీశ్ రావు ప్రశ్నించారు. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ఈ స్కామ్‌పై ఇడిని కలిసి విచారణ జరపాలని కోరతామని హరీశ్‌రావు చెప్పారు.తెలంగాణలో ఏర్పాటైన కాంగ్రెస్ కూల్చివేతల సర్కారే అని హరీశ్‌రావు విమర్శించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను కూల్చివేశారని మండిపడ్డారు. వైద్య వ్యవస్థను పూర్తిగా కూల్చేశారని, దేవుళ్ల మీద ఒట్టేసి ప్రజల విశ్వాసాన్ని కూల్చేశారని అన్నారు. ప్రభుత్వ విధానాలను తూర్పారబట్టారని పేర్కొన్నారు. హైడ్రా ఆఫీసే హుస్సేన్ సాగర్ నాలా కింద ఉందని, రంగనాథ్ ముందుగా ఆయన ఆఫీస్ కూల్చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పొలిటికల్ లీడర్లు, సెలబ్రిటీల ఫామ్ హౌజ్‌ల నుంచి వచ్చే డ్రైనేజీ నీళ్లతో చెరువులు కలుషితం అవుతున్నాయని అన్న సిఎం..మంత్రి పొంగులేటి నివాసం నుంచి వచ్చే డ్రైనేజీ వాటర్ ఎక్కడి వెళ్తున్నాయో చెప్పాలన్నారు.

పొంగులేటి ఇంటికి ఏమైనా స్పెషల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజి ఉందా..? అని ప్రశ్నించారు. ప్రతిపక్షాలను టార్గెట్ చేయడం మంచిది కాదని అన్నారు. తెలంగాణ తల్లి విగ్రహ భూమి పూజకు కనీసం మంత్రులు కూడా లేరని విమర్శించారు. తెలంగాణ తల్లి భావనకు రూపం ఇచ్చిందే కెసిఆర్ అని, ఆ క్రెడిట్ కెసిఆర్‌కే దక్కుతుందన్నారు. సిఎం స్థానంలో ఉండి న్యాయస్థానాల తీర్పుపై వక్ర భాష్యాలు చెప్పడం మంచి పద్ధతి కాదన్నారు. ఓటుకు నోటు కేసులో రేవంత్ రెడ్డికి బెయిల్ బిజెపి ఇప్పించిందా? అని ప్రశ్నించారు. ఈ పిచ్చి మాటల వల్లే ఇవాళ సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిందన్నారు. కవిత బెయిల్ విషయంలో న్యాయం, ధర్మం గెలిచిందని వ్యాఖ్యానించారు.

# బంగాళాఖాతంలో అల్పపీడనం.. తెలంగాణకు రెండు రోజులు భారీవర్షాలు

హైదరాబాద్: ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశగా కదులుతూ మరింత బలహీనపడిందని, దీని ప్రభావంతో తెలంగాణ ప్రాంతంలో శుక్ర, శనివారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.శుక్రవారం ఆదిలాబాద్, కుమురం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. అలాగే నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, హైదరాబాద్,మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం సంచాలకులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. అల్పపీడనం ప్రభావంతో ఎల్లుండి శనివారం నాడు జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాల్లో అక్కడక్కడ అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. ఆదిలాబాద్,



కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్గొండ, సూర్యాపేట, జనగాం, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ సంచాలకులు వివరించారు.

**గ్రేటర్ హైదరాబాద్‌లో అప్రమత్తం:**

మరోవైపు రాష్ట్రానికి వర్షసూచన నేపథ్యంలో జీహెచ్ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రోడ్లపై నీళ్లు నిలవకుండా ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తూ ఉండాలని గ్రేటర్ సిబ్బందిని జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఆదేశించారు.మరోవైపు మధ్య పరిసర ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ మరింత బలపడి ఈనెల 30న పశ్చిమ %-% మధ్య పరిసర వాయువ్య బంగాళాఖాతం వద్ద కేంద్రీకృతమయ్యే అవకాశం ఉందని తెలిపింది. ఇది ఉత్తర ఆంధ్రప్రదేశ్ పరిసర ప్రాంతాల మీదుగా దక్షిణ ఒడిశా వైపు కదిలే క్రమంలో మరింత బలపడి వాయుగుండంగా మారి పశ్చిమ-మధ్య పరిసర వాయువ్య బంగాళాఖాతం వద్ద కేంద్రీకృతమయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ కేంద్రం పేర్కొంది.

# నిబంధనల ప్రకారం లేకుంటే నా ఇంటిని కూల్చేయండి:తిరుపతి రెడ్డి

హైదరాబాద్: బిఆర్‌ఎస్ నాయకులు తనను లక్ష్యంగా చేసుకొని దుర్గం చెరువు అమర్ సొసైటీలోని నివాసం ఉండే వారిని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి ఆరోపించారు. తన నివాసం బఫర్ జోన్‌లో ఉందని నోటీసులు అందాయని, నిబంధనల ప్రకారం లేకుంటే తన ఇంటిని కూల్చేయాలని ఆయన స్పష్టం చేశారు. అమర్ సొసైటీ దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్ జోన్‌లో ఉందంటూ రెవెన్యూ శాఖ జారీ చేసిన నోటీసులపై సిఎం రేవంత్ రెడ్డి సోదరుడు తిరుపతి రెడ్డి స్పందించారు. బిఆర్‌ఎస్ నాయకులు తనను లక్ష్యంగా చేసుకొని అమర్ సొసైటీలోని నివాసితులను ఇబ్బందిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. తన వల్ల అమర్ సొసైటీలోని ప్రజలకు ఇబ్బందిగా ఉంటే, ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోతానని తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తాను 2015లో అమర్ సొసైటీలో ఇంటిని కొనుగోలు చేశానని తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. అప్పుడు తన ఇల్లు బఫర్ జోన్‌లో ఉందని చెప్పలేదన్నారు.ఇప్పుడు బఫర్ జోన్‌లో ఉందని నోటీసులు అందాయని నిబంధనల ప్రకారం



లేకుంటే తన ఇంటిని కూల్చివేయవచ్చని ఆయన అన్నారు. అధికారులు సమయం ఇస్తే ఇంటిని ఖాళీ చేసి వెళ్లిపోతానన్నారు. అలాగే ముఖ్యమంత్రి ప్రజల కోసమే మంచి పని చేస్తున్నారని, ఆ పనులకు తప్పకుండా తన సహకారం ఉంటుందన్నారు. నెక్టార్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, అమర్ కో ఆపరేటివ్ సొసైటీ, కావూరి హిల్స్‌లోని నివాసాలకు రెవెన్యూ శాఖ నోటీసులు జారీ చేసింది. మొత్తం 204 మందికి నోటీసులు జారీ అయ్యాయి. ఈ ఇల్లు అన్ని పెద్ద పెద్ద బంగ్లాలు, లగ్జరీ విల్లాలు, లగ్జరీ అపార్ట్‌మెంట్స్ ఉన్నాయి. దుర్గం చెరువు చుట్టూ ప్రముఖుల నివాసాలే ఉన్నాయి. ఒక్కొక్కరూ వందల కోట్ల రూపాయలతో ఈ ఇళ్లను నిర్మించుకున్నారు. నోటీసులు అందుకున్న 204 ఇళ్లు దుర్గం చెరువు ఎఫ్‌టిఎల్, బఫర్‌జోన్ పరిధిలో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తన ఇంటికి వచ్చిన నోటీసులపై సిఎం రేవంత్ రెడ్డి తమ్ముడు తిరుపతి రెడ్డి స్పందించారు. 2015లో ఇల్లు కొనుగోలు చేశామని, కొనేటప్పుడు అన్ని పత్రాలు న్యాయవాది ధ్రువీకరణ తర్వాత కొన్నామని వివరణ ఇచ్చారు. బఫర్ జోన్ లో ఉన్నట్టు ఇప్పుడు నోటీసులు ఇచ్చారన్నారు. అన్ని అనుమతులు తీసుకునే నా ముందు యజమాని ఇల్లు కట్టాడని, ఎఫ్ టిఎల్, బఫర్ జోన్ లో చెరువు ఉందా అనే విషయం తనకు తెలియదని తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు. సమయమిస్తే సామాన్లు తీసుకుంటానని, కూల్చివేస్తే సహకరిస్తానని పేర్కొన్నారు. తన నివాసం ఉన్నందుకే ఇక్కడ నివసించే అందరికి ఇబ్బంది వచ్చిందని, ప్రతిపక్షాలు తనని టార్గెట్ చేశాయని ఆరోపణలు చేశారు.

# డికె శివకుమార్‌పై సిబిఐ పిటిషన్ కొట్టివేత

కర్నాటక: ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌పై అక్రమాస్తుల కేసు(డిఎ) కేసు దర్యాప్తు కోసం ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకోవాలన్న కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చూస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను కర్నాటక హైకోర్టు గురువారం కొట్టివేసింది. డికె శివకుమార్‌పై నమోదైన రూ. 74.93 కోట్ల అక్రమాస్తుల కేసు దర్యాప్తును లోకాయుక్తకు నివేదిస్తూ 2023 డిసెంబర్ 26న రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వును సవాలు చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కె సోమశేఖర్, జస్టిస్ ఉమేష్ ఎం ఆదిగలతో కూడిన డివిజన్ బెంచ్ కొట్టివేసింది.పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలను సుప్రీంకోర్టు పరిశీలిస్తుందని తన 67 పేజీల



తీర్పులో డివిజన్ బెంచ్ తెలిపింది. ఈ కేసుపై గతంలో విచారణ జరిపిన హైకోర్టు తన తీర్పును ఆగస్టు 12న రిజర్వ్ చేసింది. కాగా..2013 నుంచి 2018 వరకు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన డికె శివకుమార్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారని సిబిఐ ఆరోపించడంతో ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం ఆయనను ప్రాసిక్యూట్ చేయడానికి సిబిఐకి అనుమతి ఇచ్చింది. కాగా.. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం గత ఏడాది నవంబర్‌లో సిబిఐకి ఇచ్చిన అనుమతిని ఉపసంహరించుకుంది.

## తెలంగాణతో పాటు మరో 6 రాష్ట్రాల్లో ఎన్ఐఏ సోదాల కలకలం



దేశ రక్షణ శాఖకు సంబంధించిన రహస్యాలను పాకిస్తాన్ గూఢచర్య సంస్థ సాయంతో లీక్ చేస్తున్నారన్న ఆరోపణలపై నమోదైన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ పాన్ ఇండియా లెవెల్‌లో సోదాలు నిర్వహించింది. తెలంగాణతో పాటు గుజరాత్, కర్ణాటక, కేరళ, ఉత్తర ప్రదేశ్, బిహార్, హర్యానాలోని మొత్తం 16 ప్రాంతాల్లో విస్తృతంగా సోదాలు చేపట్టింది. బుధవారం జరిపిన ఈ సోదాలపై గురువారం ఎన్ఐఏ ప్రకటన విడుదల చేసింది. ఈ తనిఖీల్లో 22 మొబైల్ ఫోన్లు, సెన్సిటివ్ సమాచారం కలిగిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. భారత నౌకా దళానికి చెందిన సున్నితమైన కీలక సమాచారాన్ని తెలుసుకునేందుకు శత్రుదేశం పన్నిన కుట్ర 2021లో వెలుగు చూసింది. దీనిపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనంతరం 2023 నుంచి ఎన్ఐఏ ఈ కేసును విచారిస్తుండగా ఇప్పటికే పలు అనుబంధ చార్జిషీట్లు కూడా దాఖలు చేసింది.2023 జులై 19న పరారీలో ఉన్న పాకిస్తాన్ కు చెందిన మీర్ బాలాజ్ ఖాన్ తో సహా ఇద్దరు నిందితులపై చార్జిషీట్ దాఖలు చేసింది. మీర్ బాలాజ్ ఖాన్ అరెస్ట్ అయిన నిందితుడు ఆకాష్ సోలంకితో కలిసి గూఢచర్యం రాకెట్ లో పాల్గొన్నట్లు ఎన్ఐఏ దర్యాప్తులో వెల్లడైంది. ఆ తర్వాత 2023 నవంబర్ 6న నమ్మోహన్ సురేంద్ర పాండా, అల్వెన్ అనే మరో ఇద్దరు నిందితులపై ఎన్ఐఏ అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. వీరిలో పాండా అరెస్ట్ కాగా పాకిస్థానీ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్ అల్వెన్ పరారీలో ఉన్నాడు. మే 2024లో పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్‌లతో కలిసి కుట్ర పన్నుతున్న మరో నిందితుడు అమన్ సలీం షేక్‌పై అనుబంధ చార్జిషీట్ దాఖలు చేసింది. సంచలనం సృష్టించిన ఈ కేసులో విచారణ కొనసాగుతోంది.

## సిఎం అయి ఉండి ఈ విధంగా మాట్లాడుతారా?:సుప్రీంకోర్టు



హైదరాబాద్:బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవితకు బెయిల్ విషయంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను సుప్రీంకోర్టు గురువారం తప్పుపట్టింది. ఈ నేపథ్యంలో ఆయనను తీవ్రంగా మందలించింది. 2015 ఓటుకు నోటు కేసు విచారణ బదలాయింపు పిటిషన్ నేపథ్యంలో న్యాయమూర్తులు బిఆర్ గవాయ్, పికె మిశ్రా, కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం స్పందించింది. మాజీ సిఎం కెసిఆర్ పార్టీకి, కేంద్రంలోని అధికార బిజెపికి మధ్య కుదిరిన చీకటి ఒప్పందం (డీల్) క్రమంలోనే కవితకు బెయిల్ వచ్చిందని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు ఈ విధంగా మాట్లాడటం పద్ధతి కాదు, న్యాయస్థానం తీర్పును తప్పుపడుతారా? అని త్రిసభ్య ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత జైలు పాలయ్యి, సుప్రీంకోర్టు బెయిల్‌తో ఇటీవలే బయటకు వచ్చారు.రేవంత్ వ్యాఖ్యలపై ధర్మాసనం ఘాటైన పదజాలంతో స్పందించింది.

ఆయన మాటలు న్యాయవ్యవస్థ పట్ల ప్రజలలో తప్పుడు భావనలకు దారితీస్తాయని పేర్కొంది. "ఆయన చెప్పింది, పత్రికలలో వచ్చింది. దీనిని చదివారా? లేకపోతే చదవండి, బాధ్యతాయుత ముఖ్యమంత్రి ఏ విధమైన ప్రకటన చేశారనేది తెలుస్తుంది. ఇటువంటి మాటలతో ప్రజలలో తప్పుడు అభిప్రాయం కలుగుతుంది. సిఎం అయి ఉండి ఈ విధంగా మాట్లాడటం , ప్రకటన వెలువరించడం ఈ స్థానానికి సముచితమా? రాజ్యాంగ నిర్వాహకులు ఈ విధంగా మాట్లాడటం ఏమిటి" అని ధర్మాసనం పేర్కొంది. రాజకీయ శత్రుత్వాల మధ్యలోకి కోర్టులను లాగడం ఎందుకు? తాము రాజకీయ పార్టీలతో సంప్రదించి అ, రాజకీయ కోణాలలో ఉత్తర్వులు వెలువరిస్తామా? రాజకీయ నాయకులు కానీ ఇతరులు కానీ తమ తీర్పులు, ఉత్తర్వులను విమర్శిస్తే పట్టించుకునేది లేదు. తమ అంతరాత్మ ప్రబోధం, బాధ్యతల దశలో చేసిన ప్రమాణానికి అనుగుణంగా విధులు నిర్వరిస్తామని బిఆర్ గవాయ్ సారధ్యపు ధర్మాసనం తెలిపింది.సిఎం రేవంత్ రెడ్డి తరఫున కేసుకు సంబంధించి సీనియర్ లాయర్ ముఖుల్ రొహత్గీ , సిద్ధార్థ్ లూథ్రాలు హాజరయిన దశలో ధర్మాసనం సిఎం వ్యాఖ్యలను ప్రత్యేకంగా ప్రస్తావించింది. దీనిపై వారు వివరణ ఇస్తూ ఇకపై ఇటువంటివి జరగవని న్యాయవాదులు తెలిపారు. వ్యవస్థల పట్ల తమకు సరైన గౌరవం ఉంది. వ్యవస్థల మధ్య పరస్పర గౌరవం ఉండటం విద్యుక్త, ప్రాథమిక ధర్మం , విధి అని తాము భావిస్తున్నామని సముచిత సరైన దూరం అత్యవసరం అని కూడా ధర్మాసనం పేర్కొంది. శాసనపరమైన వ్యవహారాలలో న్యాయస్థానం జోక్యం చేసుకోదు. ఈ విధంగా లెజిస్లేచర్ జుడిషియరీ మధ్య సరైన పద్ధతి ఉండాలని ఆశిస్తామని బెంచ్ స్పష్టం చేసింది. దీనిని తాము లెజిస్లేచర్ నుంచి కూడా ఆశిస్తున్నామని స్పష్టం చేశారు. రాజకీయాలను పరిగణనలోకి తీసుకుని రూలింగ్‌లు వెలువరిస్తామా? ఏమనుకుంటున్నారు? అని ధర్మాసనం నిలదీసింది. క్యాష్ ఫర్ ఓటు స్కామ్ కేసులో సిఎం రేవంత్ రెడ్డి నిందితుడుగా ఉన్నారు.కేసు విచారణను రాష్ట్రం నుంచి మధ్యప్రదేశ్‌లోని భోపాల్ హైకోర్టుక బదలాయించాలని పిటిషన్ దాఖలు అయింది. .స్వరాష్ట్రంలోనే ఈ కేసు విచారణ జరిగితే సాక్షలను ప్రభావితం చేయడం, ఆధారాలను దెబ్బతీయడం జరుగుతుందని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ కేసు విచారణ నేపథ్యంలోనే సుప్రీంకోర్టు నుంచి రేవంత్ రెడ్డి మందలింపులను చవిచూడాల్సి వచ్చింది. సిఎం మాటలు బహిరంగం అయ్యాయి. దీనిని తాము ఏ విధంగా భావించాల్సి ఉంటుందని కవితకు బెయిల్ ఇచ్చిన ఇదే ధర్మాసనం ప్రశ్నించింది. కవితకు బెయిల్ విషయంలో వ్యాఖ్యలపై ధర్మాసనం నుంచి మందలింపులకు గురైన సిఎం రేవంత్ రెడ్డికి , మరో వైపు ఓటుకు నోటుకేసు వేరే హైకోర్టుకు అప్పగించాలనే విషయంలో ఉపశమనం దక్కింది. కేసు బదిలీ పిటిషన్ పట్ల సానుకూలత చూపలేదు. తమకు రాష్ట్ర హైకోర్టు సహచర బెంచ్‌పై పూర్తి విశ్వాసం ఉందని సుప్రీంకోర్టు తెలిపింది. తాము కేసు విచారణను సోమవారానికి వాయిదా వేస్తున్నామని , ఇప్పటికిప్పుడు దీనిని ముగించడం లేదని, లెజిస్లేచర్ వ్యవహారాలలో తాము కలుగచేసుకునేది లేదని, వారి నుంచి కూడా దీనిని ఆశిస్తున్నామని తెలిపింది.

### దేశవ్యాప్తంగా 3 రోజులపాటు పాస్ పోర్టు సేవలు బంద్

హైదరాబాద్:దేశంలో మూడు రోజుల పాటు పాస్ పోర్ట్ సేవలు నిలిచిపోనున్నాయి. ఈ మేరకు పాస్ పోర్ట్ సేవా సమితి ప్రకటన విడుదల చేసింది. దేశవ్యాప్తంగా గురువారం రాత్రి రాత్రి 8 గంటల నుంచి సెప్టెంబర్ 2 ఉదయం 6 గంటల వరకు పాస్ పోర్ట్ సర్వీసులు పనిచే యవు. సాఫ్ట్‌వేర్ మెయిన్‌టెనెన్స్ కోసం మూడు రోజుల పాటు పాస్ పోర్ట్ సేవలను నిలిపివేస్తున్నట్లు పాస్ పోర్ట్ సేవా సమితి వెల్లడించింది. పాస్ పోర్ట్ సంబంధిత సర్వీసులను మరింత మెరుగు పరిచేందుకే తాము ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. ఆయా తేదీల్లో ఉన్న అపాయింట్మెం ట్స్‌ను ఇతర తేదీలకు సర్దుబాటు చేస్తామని పేర్కొంది.

## హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని 'జాతీయ క్రీడా దినోత్సవం'గా జరుపుకోవడం విశేషం




**రఘునాథ్ పల్లి, ఆగస్టు29 డైలీ రిపోర్ట్** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై కుమార్ గౌడ్ క్రీడాకారులు, క్రీడాభిమానులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని 'జాతీయ క్రీడా దినోత్సవం'గా జరుపుకోవడం గర్వకారణమన్నారు. "నా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం నా కర్తవ్యం" అన్న ధ్యాన్ చంద్ మాటల స్ఫూర్తితో తెలంగాణ ప్రజాప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మేకల నరేందర్, గాదె మహేందర్ రెడ్డి, మినుముల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొయ్యడ మల్లేష్, బండి కుమార్ గౌడ్, నూనె ముంతలా యాక స్వామి గౌడ్, తాటికొండ వెంకటేష్ యాదవ్,మరకాల మహేందర్, రెడ్డి,ముప్పిడి సాంబ ముదిరాజ్, కోళ్ల రాజు, జేరిపోతుల మహేందర్, రంగు రాజు,యాకూబ్, దుబ్బాక సతీష్,డాక్టర్ లక్ష్మణ్, చింతకింది శ్రీహరి, మల్కాపురం శ్రీకాంత్ గౌడ్,కాదు నూరి మధుసూదన్,గుండ నవీన్, కుమార్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రన్ ఫర్ ఫిట్నెస్ నిర్వహించిన ఎన్సిసి క్యాడేట్లు.



**సంగారెడ్డి ఆగస్టు 29** :సంగారెడ్డి జిల్లా కంది మండలం లో గల ఆయుధాకర్మాగారంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఓడిఎఫ్ లో గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రన్ ఫర్ ఫిట్నెస్ కార్యక్రమాన్ని ఎన్సిసి విద్యార్థులు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.జయంతివాణి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్సిసి అధికారి సిహెచ్. విజయభాస్కర్ మాట్లాడుతూ అందరూ ఫిజికల్ ఫిట్నెస్ సాధించడానికి క్రీడలు, ఆటలు, యోగా లాంటి వ్యాయామాలు చేయాలన్నాడు. గురుజాడ అప్పారావు గారు అన్నట్లు "ఈసురోమని మనుసులలుంటే దేశమే గతి బాగుపడు నోయ్". దేశం అభివృద్ధి చెందాలంటే యువత శారీరకంగా, మానసికంగా బలంగా ఉండాలి. అప్పుడే దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుంది. యువత దురాలవాట్లకు అలవాటు పడి బలహీనంగా మారి దేశానికి భారంగా మారవద్దన్నారు. అనంతరం విద్యార్థులకు రన్ ఫర్ ఫిట్నెస్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిహెచ్. రజిత ,ఎస్ రవీందర్, చవాన్ సుభాన్ సింగ్, ఏ. శ్రీనివాసరావు, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

## కోల్‌కతా హత్యాచార ఘటన... మమతా బెనర్జీపై కాంగ్రెస్ నేత తీవ్ర విమర్శలు

**దర్యాప్తు సజావుగా సాగాలని మమత కోరుకోవడం లేదని విమర్శ**

**కేసు దర్యాప్తు సాగితే ఎన్నో రహస్యాలు బయటకు వస్తాయని వ్యాఖ్య**

**అలా జరగడం మమతకు ఇష్టం లేదని ఆరోపణ**



కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో జరిగిన హత్యాచార కేసులో దర్యాప్తు సజావుగా సాగాలని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కోరుకోవడం లేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత అధిర్ రంజన్ చౌదరి సంచలన ఆరోపణలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ కేసు దర్యాప్తు సరైన విధంగా సాగితే ఎన్నో రహస్యాలు బయటకు వస్తాయన్నారు. కానీ ఇలా జరగడం మమతకు ఇష్టం లేదని ఆరోపించారు. ఈ ఘటన నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు ఆమె ఇష్టారీతిన మాట్లాడుతున్నారని విమర్శించారు. కానీ ప్రజలు భయపడరని, ఈ ఘటన ఇప్పుడు ప్రజా ఉద్యమంగా మారిందన్నారు. బెంగాల్‌లో బీజేపీ అరాచకం సృష్టిస్తోందని ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. శాంతియుత వాతావరణాన్ని భగ్నం చేయాలని బీజేపీ కోరుకుంటోందని ధ్వజమెత్తారు. ప్రజలను నిరంతరం రెచ్చగొడుతూ అలజడులకు ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. కాషాయ పాలకుల ఉచ్చులో బెంగాల్ ప్రజలు చిక్కుకోరని తాము భావిస్తున్నామన్నారు. లైంగిక దాడుల విషయానికి వస్తే ఉత్తర ప్రదేశ్ సహా బీజేపీ పాలిత రాష్ట్రాల్లోనే ఈ ఘటనలు అధికంగా వెలుగు చూస్తున్నాయన్నారు. బీహార్‌లోనూ లైంగిక దాడుల ఘటనలు తరుచూ చోటు చేసుకుంటున్నాయన్నారు.

## మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తూ వారిని ప్రోత్సహించాలి

**స్టేషన్ ఘనపూర్,ఆగస్టు 29(డైలీ రిపోర్ట్)** స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మరియు వరంగల్ పార్లమెంట్ ఎంపీ కడియం కావ్య నివాసంలో రఘునాథపల్లి మండల మహిళా అధ్యక్షురాలు మాజీ ఎంపీటీసీ పేర్నె ఉషా రవి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.మహిళా కాంగ్రెస్ నూతన మండల గ్రామ కమిటీలను ఏర్పాటు చేయడంలో భాగంగా మండలంలోని 36 గ్రామాలు ఉండగా అందులో 28 గ్రామాలకు మండల మహిళా గ్రామ శాఖ అధ్యక్షురాలను నియమిస్తూ మన ఎమ్మెల్యే, ఎంపీకి నివేదిక సమర్పించడం జరిగింది. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ గెలుపు కోసం అహర్నిశలు పనిచేసిన మహిళా కాంగ్రెస్ నాయకులకు స్థానిక సంస్థలలో అవకాశాలు కల్పించాలని కోరడం జరిగింది. అలాగే మండలంలోని మహిళలకు స్వయం ఉపాధి కల్పిస్తూ వారిని ప్రోత్సహించాలని కడియం కావ్యని కోరడం జరిగింది.ఈ విషయం పై ఎంపీ మాట్లాడుతూ కష్టపడే ప్రతి మహిళకు నేను తోడుగా




ఉంటానని హామీ ఇవ్వడం జరిగింది.ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు తుమ్మ విజయమేరి , లింగాల గణపురం మండల అధ్యక్షురాలు బుట్ రెడ్డి శ్రీలత రెడ్డి,




గ్రామ శాఖ అధ్యక్షురాలు శ్రీలత, అరుణ ,లింగమ్మ , రాగిరి స్వప్న, జూకంటి పద్మ, సాట్ల యాకమ్మ వివిధ గ్రామ శాఖ అధ్యక్షురాలు మహిళా నాయకురాలు పాల్గొనడం జరిగింది.

## సంగారెడ్డి బ్రహ్మా కుమారీస్ నిలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు












**పత్రిక విలేకరుల తో పాటు పలువురికి రాఖీ కట్టిన బ్రహ్మకుమారిస్**

**సంగారెడ్డి, 29(డైలీ రిపోర్ట్)** సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని బ్రహ్మకుమారిస్ నిలయంలో రాఖి పండుగ వేడుకలు ఘనంగా



నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సంగారెడ్డి పాత్రికేయులను, మీడియా రంగంలో పనిచేసే వారికి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో బ్రహ్మకుమారి మాట్లాడుతూనేటి ప్రపంచంలో, మనశ్శాంతిని సాధించడం మన అత్యంత ముఖ్యమైన పని అని జీవితాంతం శాంతిని కాపాడుతూ, మానవాళికి సేవ చేస్తూ, మన లక్ష్యాల కోసం అవిశ్రాంతంగా కృషి



చేయాలి" అని బ్రహ్మకుమారిస్ పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ ప్రతికూల నమ్మకాలను విడిచిపెట్టి, మన ఉద్దేశ్యాన్ని ప్రతిబింబించమని మరియు దేశం యొక్క పురోగతి మరియు దాని ప్రజల శ్రేయస్సు కోసం సామరస్యంతో కలిసి పనిచేయాలని కూడా వారు అన్నారు. అనంతరం పాత్రికేయుల ను శాలువాలతో సత్కరించి మిఠాయిలు తినిపించి రాఖీ కట్టారు.

## ఆసుపత్రికి వచ్చే రోగుల నుండి ఇష్టారీతిన ఫీజులు వసూలు చేయొద్దు

**డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధి లక్షణాలతో ఆసుపత్రికి వస్తే తప్పకుండా రక్త నమూనాలను ఎలిజా పరీక్షలకు పంపించాలి**

**లితప్పనిసరి అయితే తప్ప గర్భిణీలకు సిజేరియన్ చేయొద్దు - జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి ఆగస్టు 29 (డైలీ రిపోర్ట్):** వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రులను ల్యాబ్లను ఆకస్మితిగా తనికి చేసిన కలెక్టర్ డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధి లక్షణాలతో రోగులు ప్రైవేట్ ఆసుపత్రికి వస్తే తప్పకుండా రక్త నమూనాలను ఎలిజా పరీక్షలకు పంపించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు.

జిల్లాలో డెంగ్యూ కేసులు నమోదు అవుతున్న నేపథ్యంలో గురువారం ఉదయం వనపర్తి పట్టణంలోని సుధా నర్సింగ్ హోమ్, సృష్టి హాస్పిటల్ ను కలక్టర్ ఆకస్మికంగా సందర్శించారు.

ఆసుపత్రిలో డెంగ్యూ, మలేరియా వ్యాధులతో ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని కలిసి మాట్లాడారు.

ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది, ఎంత చార్జి వసూలు చేస్తున్నారు అనే వివరాలతో పాటు సీజనల్ వ్యాధి అనుమానిత



రోగుల నుండి రక్త నమూనా సేకరించి ఎలిజా పరీక్షలకు తప్పనిసరిగా పంపించాలని ప్రైవేట్ డాక్టర్లను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే రోగుల నుండి ఇష్టారీతిన ఫీజులు వసూలు చేయవద్దని చికిత్సకు ఎంత చార్జి తీసుకుంటారో సూచిక బోర్డు పెట్టాలని సూచించారు.గర్భిణీలు ప్రసవానికి వస్తె సిజేరియన్ కాకుండా సాధారణ ప్రసవాలు జరిగేవిధంగ చూడాలన్నారు. తప్పనిసరి అయితే తప్ప సిజేరియన్ చేయొద్దని సూచించారు. ఇప్పటివరకు జరిగిన ప్రసవాల రిజిస్టరు పరిశీలించారు.

సెల్లార్ ను కేవలం వాహనాల పార్కింగ్ కు మాత్రమే ఉపయోగించాలని ఇతర అవసరాలకు ఉపయోగిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సృష్టి హాస్పిటల్ లోని సెల్లార్ లో ఎక్సేరే గది ఉండటం, ఆక్సిజన్ సిలిండర్లు, ఇతరత్రా సామాన్లు ఉండటం గమనించిన కలక్టర్ మున్సిపల్ ఇంజనీరును పిలిపించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెల్లార్ లో కేవలం



వాహనాలు నిలిపేందుకు తప్ప ఇతర అవసరాలకు వినియోగించడానికి వీలు లేదని తెలిపారు.

వసతి గృహంలో ఉండే విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

వసతి గృహంలో ఉండే విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.

గురువారం జంగిడిపురం ఎస్సీ ప్రిమెట్రిక్ బాయ్స్ హాస్టల్ ను సందర్శించిన కలెక్టర్ వసతి గృహంలో విద్యార్థులకు ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. డైనింగ్ హాల్, ఇతర మౌలిక సదుపాయాల కొరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని ఎస్సి కార్పొరేషన్ ఈ.డి నుషితను ఆదేశించారు. మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం పెట్టాలని వార్డెన్ ను ఆదేశించారు.

ప్రోగ్రాం ఆఫీసర్ డా. సాయినాథ్ రెడ్డి, ఎస్సి కార్పొరేషన్ ఈ.డి నుషిత, వైద్యులు తదితరులు కలక్టర్ వెంట ఉన్నారు.

## ఎన్ కౌంటర్.. ముగ్గురు మహిళా నక్సలైట్లు హతం

**ఛత్తీస్ గఢ్ లో ఎన్ కౌంటర్**

**ఉదయం నుంచి మావోలు, భద్రతా బలగాల మధ్య కాల్పులు**

**ఇంకా కొనసాగుతున్న ఎన్ కౌంటర్**

మావోయిస్టులకు మరోసారి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఛత్తీస్ గఢ్ లోని నారాయణపూర్, కంకేర్ జిల్లాల సరిహద్దుల్లో నక్సలైట్లు, భద్రతా బలగాల మధ్య ఎన్ కౌంటర్ కొనసాగుతోంది. ఈ ఘటనలో ఇప్పటి వరకు ముగ్గురు



మహిళా నక్సలైట్లు హతమయ్యారు. ఎన్ కౌంటర్ జరిగిన స్థలంలో మృతదేహాలు, ఆయుధాలతో పాటు పలు రకాల వస్తువులను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ విషయాన్ని పోలీసు అధికారులు వెల్లడించారు. బీఎస్ఎఫ్, జిల్లా రిజర్వ్ గార్డ్స్, ఎస్టీఎఫ్ సిబ్బంది ఎన్ కౌంటర్ లో పాల్గొన్నారు. ఎన్ కౌంటర్ లో భద్రతా బలగాలు సురక్షితంగా ఉన్నాయి. ఉదయం నుంచి ఎన్ కౌంటర్ కొనసాగుతోందని... ఆ ప్రాంతంలో ఇంకా సెర్చ్ ఆపరేషన్ ను నిర్వహిస్తున్నారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ తెలిపారు.

# మూసి ఉన్న షాప్ లే వాళ్ళ టార్గెట్

**రెక్కీ చేసి షట్టర్లు ఎత్తి మరీ దొంగతనం**

**జి ఆర్ మొబైల్ లో దొంగతనం చేసిన దొంగల అరెస్టు**

**కేసును చేదించడంలో పోలీసులు అద్భుత ప్రతిభ**

**టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించిన పోలీసులు**

**ఇద్దరిని అరెస్టు చేసిన బెంగళూరు పోలీసులు,**

**మరో ఇద్దరిని అరెస్టు చేసిన షాద్నగర్ పోలీసులు**

**మొత్తం ఆరుగురిలో ఇద్దరు పరారీ**



**షాద్ నగర్ ఆగస్టు 29 (డైలీ రిపోర్ట్)** షాద్ నగర్ పట్టణ ఏసిపి రంగస్వామి ప్రెస్ మీట్ నిర్వహించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 19వ తేదీ రాత్రి షాద్నగర్ పట్టణ చౌరస్తాలో గల జి ఆర్ మొబైల్స్ లో దొంగతనం జరిగిందని ఆ షాప్ కి యజమానిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు విచారణ ప్రారంభించి అరెస్టు చేసిన దొంగల వివరాలు తెలియ చేసారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈ దొంగతనం కేసులో ఆరుగురు నిందితులు ఒక గాంగ్ గా ఏర్పడి, వీరు మద్య రాత్రి వేళలో రోడ్ వెంట మూసి ఉన్న షాప్ లను రెక్కి చేసి, అట్టి షాప్ ల యొక్క సెట్టర్ లను బలవంతముగా ఎత్తి వేసి, దాని లో గల నగదు డబ్బులు లను, ఇంకా వస్తువులను దొంగిలించిన కేసు విషయం లో ఇద్దరు నిందితులను పట్టుకోని అరెస్టు చేసామని కోర్ట్ లో హాజరు పరచడం జరుగుతుందని తెలిపారు. ఈ కేసులో నిందితులుగా A1. గంగాధర్, A2. అనిల్, A3. హనుమంత్ రాజు, A4.పృధ్విరాజు, A5.అభి, A6.శశి %స్త్రు% ఉన్నట్లు ఏసిపి రంగస్వామి తెలిపారు. కేసు వివరాల ప్రకారం ఈ ఆరుగురు నిందితలు ఒక గ్యాంగ్ గా ఏర్పడి, ఈ గ్యాంగుకు లీడర్ గా ఉన్న గంగాధర్ తన కారు మహేంద్ర ఎక్స్ యు వి 500 వాహనం నెం. DL. 08. కేక్ 2517 లో వచ్చి మీరు ఏదైతే షాప్ లో దొంగతనం చేయాలి అని అనుకుంటారు అట్టి షాప్ కి ఇంచుమించు ఒక మీటర్ దూరంలో రెండవ నిందితుడైన అనిల్ కారును ఆపుకుని కారును ఆన్ ఉంచుకొని ఉండగా నిందితులు గంగాధర్, హనుమంత రాజు, మరియు శశి లు దొంగతనం చేయాలనుకున్న షాపు వద్దకు వెళ్లి ఆ షాప్ యొక్క షట్టర్ ను అందరూ కలిసి బలవంతంగా పైకి లేపి కొంచెం వెనుకకు లాగి ఒక వ్యక్తి దూరెంతటి సందు ఏర్పడిన తర్వాత మొదటి నిందితుడైన గంగాధర షాపులోనికి ఆ సందులో నుంచి పాక్కుంటూ వెళ్లి మిగతా నలుగురు ఎవరైనా వస్తారేమో అని ఆ పరిసర ప్రాంతాలను గమనిస్తూ ఉంటారని, లోనికి దూరిన వ్యక్తి ఆ షాప్ లో ఉన్న నగదు డబ్బులు మరియు సీసీ కెమెరా యొక్క డివిఆర్ బాక్స్ ను కూడా దొంగిలించి బయటకు తీసుకొని రాగా అక్కడి నుండి కారులో పరారై అదే రోజు రాత్రి పట్టణంలోని మిగతా నాలుగు షాపులో కూడా దొంగతనాలు చేసి అక్కడి నుండి షాబాద్ లో రెండు షాపుల్లో మరియు మొయినాబాద్ లోని ఒక షాపులో షట్టర్లను బలవంతంగా ఎత్తి ఆ దుకాణాలు కూడా నగదు డబ్బులను దొంగతనం చేశారని తెలిపారు. ఇలా దొంగలించిన డబ్బులను వారి జల్సాలకు మరియు మిగతా అవసరాలకు వాడుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కేసులో ఆరుగురు నిందితులు కాగా మొదటి ఇద్దరి నేరస్తులను బెంగళూరు పోలీసులు అరెస్టు చేశారని, మిగతా ఇద్దరిని షాద్నగర్ పోలీసులు ఎంతో చాకచక్యంగా వ్యవహరించి అరెస్టు చేశారని, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు ఏసిపి రంగస్వామి తెలిపారు. నిందితుల వద్ద నుండి పదివేల రూపాయలు నగదు ను జప్తు చేసి వారిపై క్రైమ్ నెంబర్ 640/2024,U/Sec 331(4), 305 BNS కేసు పెట్టి వారిని కోర్టులో హాజరు పరుస్తామని తెలిపారు. కేసు లక్ష్య చేదనలో కమిషనర్ ఆఫ్ పోలీసు, సైబరాబాద్ పర్య వేక్షణలో, శంషాబాద్ DCP. శంషాబాద్ Addi DCP. షాద్ నగర్ ACP పర్యవేక్షణలో తేదీ 29.08.2024 రోజు ఉదయం కేసు విచారణాధికారి ఇన్స్పెక్టర్ పి. విజయ్ కుమార్ మరియు %జజూ% ఇన్స్పెక్టర్ పవన్ మరియు సబ్ ఇన్స్పెక్టర్ అవినాష్, ఇంకా డిటెక్టివ్ సబ్ ఇన్స్పెక్టర్ C.శరత్ కుమార్ పిఎస్ షాద్ నగర్ మరియు కానిస్టేబుల్ సిబ్బంది నరేందర్ కృష్ణ, శంకరయ్య, మహేశ్, రాజేశ్. రఫీ లు పై ఇద్దరు నిందితులను సంయుక్తముగా పట్టుకోవడం జరిగింది. ఇట్టి కేసు చెదనలో చాకచక్యంగా వ్యవహరించిన షాద్ నగర్. %ూూ% ఇన్స్పెక్టర్ పి.విజయ్ కుమార్ C. శరత్ కుమార్, సబ్ ఇన్స్పెక్టర్., కానిస్టేబుల్ సిబ్బంది నరేందర్, కృష్ణ, శంకరయ్య, మహేశ్. రాజేశ్, రఫీ లను అభినందించడం జరుగుతుందని, మరియు వారికి తగిన రివార్డ్ లను పై అధికారుల ద్వారా ఇప్పించడం జరుగుతుందని ఏసిపి రంగస్వామి తెలిపారు.

# సైబర్ బాధితుల సత్వర న్యాయానికి బ్యాంకర్స్ పాత్ర కీలకం.

**గుర్తుతెలియని వ్యక్తులకు బ్యాంక్ అకౌంట్స్ ఇవ్వరాదు.**

**సైబర్ నేరాల దర్యాప్తులో బ్యాంకర్స్ పోలీసులకు సహకరించాలి.**





**సంగారెడ్డి ఆగస్టు 29** నేరాల నివారణ, బాధితులకు సత్వర న్యాయానికి జిల్లాలోని వివిధ బ్యాంక్ లకు చెందిన అధికారులతో కో-ఆర్డినేషన్ మీటింగ్ నిర్వహించారు జిల్లా ఎస్పీ శ్రీ చెన్నూరి రూపేష్ ఐ.పి.యస్. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను వినియోగించుకొని ఎంత వేగంగా అభివృద్ధి చెందుతున్నమో అంతే వేగంగా వివిధ రకాల నేరాలు పుట్టుకొస్తున్నాయని, స్మార్ట్ ఫోన్ వినియోగం పెరిగి, క్యాష్ లెస్ లావాదేవీలు జరుగుతున్న ప్రస్తుత రోజుల్లో అడ్డ దారిలో డబ్బులు సంపాదించాలని, ఫిజికల్ కాంటాక్ట్ లేకుండా కేవలం యు.పి.ఐ. మరియు బ్యాంక్ అకౌంట్ లను ఆధారంగా చేసుకొన్న, సైబర్ నేరగాళ్లు తప్పుడు మార్గాలను ఎంచుకొని, అమాయక ప్రజలే టార్గెట్ గా వివిధ రకాల సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. సైబర్ నేరాలకు సంభందించి బ్యాంక్ సిబ్బంది దర్యాప్తు అధికారులకు సహకరించాలని, నేరానికి గురైన బ్యాంక్ అకౌంట్స్ సంభందించిన పూర్తి సమాచారాన్ని ఇవ్వాలని సూచించారు. కోర్టు అనుమతితో సైబర్ బాధితులకు చేరవలసిన డబ్బును అకౌంట్ నందు క్రెడిట్ చేసి అట్టి అకౌంట్ ను అన్-ఫ్రీజింగ్ చేసి సైబర్ బాధితులకు అండగా నిలవాలని సూచించారు. సైబర్ బాధితులు కోల్పోయిన డబ్బు రీఫండ్ అయినప్పుడే వారిలో పోలీసు లపై నమ్మకం పెరుగుతుందని అన్నారు. ప్రతి బ్యాంక్ లోను హై రేసల్యూషన్ కలిగిన సిసి కెమెరాలను బ్యాంక్ లోపల, బయట అదేవిధంగా ఎ.టి.యం సెంటర్ లలో అమార్చాలని సూచించారు. సెక్యూరిటీ అలారంలు బ్యాంక్ లోను, ఎ.టి.యం సెంటర్ లలో అమార్చాలని సూచించారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ.. సైబర్ నేరాల నుండి బయటపడాలంటే అవగాన ఒక్కటే మార్గం అని, వాట్స్ అప్, ఇంస్టాగ్రామ్ ఫేస్ బుక్ వంటి సోషల్ మీడియా ద్వారా వచ్చే అనుమానిత లింక్ లను, apk ఫైల్స్ ఓపెన్ చేయరాదని, ఆన్లైన్ లో అపరిచితులతో పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. సైబర్ మోసానికి గురి అయితే 1930 కి కాల్ చేసి గాని లేదా www.cybercrime.gov.in లో సైబర్ క్రైమ్ పోర్టల్ నందు రిపోర్ట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి డియస్పి సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డియస్పి రవీందర్ రెడ్డి, జహీరాబాద్ డియస్పి రామ్ మోహన్ రెడ్డి, నారాయణ ఖేడ్ డియస్పి వెంకట్ రెడ్డి, సైబర్ క్రైమ్ డియస్పి వేణు గోపాల్ రెడ్డి, నార్కోటిక్ ఇన్స్పెక్టర్ రమేష్, యస్.బి. ఇన్స్పెక్టర్ విజయ్ కృష్ణ, జిల్లాలోని వివిధ బ్యాంక్ లకు చెందిన అధికారులు మరియు మరియు జిల్లా ఇన్స్పెక్టర్స్, సబ్- ఇన్స్పెక్టర్స్, తదితరులు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్





**శంకర్‌పల్లి: ఆగస్టు 29: (డైలీ రిపోర్ట్):** సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్య గౌడ్, డాక్టర్ రేవతి రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డెంగ్యూ, చికెన్ గున్యా పట్ల అప్రమత్తంగా ఉండి జ్వరం ఉన్నట్లయితే వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రావాలన్నారు. వర్షాకాలంలో ఇంటి పరిసర ప్రాంతాలలో మురికి గుంటలు ఉన్నట్లయితే దోమలు పెరిగి డెంగ్యూ చికెన్ గున్యా బారిన పడుతారని అన్నారు. ప్రజలు ఇంటి పరిసర ప్రాంతాల్లో మురికి గుంటలు లేకుండా చూసుకోవాలన్నారు. కాచి చల్లార్చి వొడపోసిన నీటిని మాత్రమే త్రాగాలని, వేడి వేడి ఆహార పదార్థాలు భుజించాలని, దీనివలన కొంతవరకు వ్యాధులను అరికట్టవచ్చు అన్నారు. సీఐ హబీబుల్లాఖాన్ మాట్లాడుతూ రాబోయే గణేష్ ఉత్సవాలలో ఎటువంటి అనుచిత సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ సురేందర్, ఎస్సై సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.



# " వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ "కు డా. కొప్పుల విజయ్ కుమార్ ఎంపిక

**శంకర్‌పల్లి: ఆగస్టు 29:(డైలీ రిపోర్ట్):** వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ కు సోషియల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ చైర్మన్ డా. కొప్పుల విజయ్ కుమార్ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ రియాలిటి ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ అకాడమీ, న్యూఢిల్లీ వారి ద్వారా సెప్టెంబర్ 14 న బెంగళూరులో నిర్వహించే కార్యక్రమంలో " వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ " తీసుకోవడానికి లెటర్ వచ్చిందన్నారు. తాను చేసిన ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు, న్యాయ సేవా కార్యక్రమాలు చేసినందుకు గుర్తించి 16 దేశాల కమిటీ సభ్యుల ద్వారా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఇంతటి గొప్ప అవార్డు పొందే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. మనము చేసే మంచి పనులే మనకు మార్గదర్శకాలు అని అన్నారు. ఈ అవకాశం రావడానికి సహకరించిన న్యాయ విభాగం మిత్రులకు, అకాడమీ వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని 'జాతీయ క్రీడా దినోత్సవం'గా జరుపుకోవడం విశేషం

**రఘునాథ్ పల్లి, ఆగస్టు29 డైలీ రిపోర్ట్** జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జనగామ జిల్లా కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వై కుమార్ గౌడ్ క్రీడాకారులు, క్రీడాభిమానులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. హాకీ దిగ్గజం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని 'జాతీయ క్రీడా దినోత్సవం'గా జరుపుకోవడం గర్వకారణమన్నారు. "నా దేశాన్ని ముందుకు తీసుకెళ్లడం నా కర్తవ్యం" అన్న ధ్యాన్ చంద్ మాటల స్ఫూర్తితో తెలంగాణ ప్రజాప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మేకల నరేందర్, గాదె మహేందర్ రెడ్డి, మినుముల వెంకట్ రెడ్డి, మాజీ సర్పంచ్ కొయ్యడ మల్లేష్, బండి కుమార్ గౌడ్, నూనె ముంతలా యాక స్వామి గౌడ్, తాటికొండ వెంకటేష్ యాదవ్,మరకాల మహేందర్, రెడ్డి,ముప్పిడి సాంబ ముదిరాజ్, కోళ్ల రాజు, జేరిపోతుల మహేందర్, రంగు రాజు,యాకూబ్, దుబ్బాక సతీష్,డాక్టర్ లక్ష్మణ్, చింతకింది శ్రీహరి, మల్కాపురం శ్రీకాంత్ గౌడ్,కాదు నూరి మధుసూదన్,గుండ నవీన్, కుమార్, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా సుమారు రూ: 3.75 కోట్ల విలువ గల 13.990-కిలోల ఆల్ప్రాజోలం, 950.285-కిలోల ఎండు గంజాయి దహనం: జిల్లా ఎస్పీ శ్రీ చెన్నూరి రూపేష్ ఐ.పి.యస్




**సంగారెడ్డి ఆగస్టు 29**సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్ లలో నమోదైన 13 కేసుల్లో నిందితుల నుండి సీజ్ చేసిన ప్రభుత్వ నిషేధిత ఆల్ప్రాజోలం 3-కిలోలు, ఎండు గంజాయి 950-కిలోలను, యన్.డి.పి.యస్. చట్ట ప్రకారం కోర్టు అనుమతి తీసుకుని, న్యాయాధిపతుల ముందు కేసు ప్రాపర్టీని యఫ్.యస్.ఎల్. కొరకు శాంపిల్ తీసి మిగిలిన మొత్తాన్ని జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాడు సంగారెడ్డి జిల్లాలోని పాశమైలారం పారిశ్రామిక వాడలలోని మెడీకేర్ పరిశ్రమలో ఇన్సినిరేషన్ ప్రక్రియ ద్వారా పర్యావరణ కాలుష్య నియంత్రణ నిబంధనలను పాటిస్తూ దహనం చేయడం జరిగిందని, దహనం చేసిన నిషేధిత ఆల్ప్రాజోలం మరియు గంజాయి విలువ సుమారు 3.75 కోట్ల రూపాయలు ఉంటుందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్ ఐ.పి.యస్. వివరించారు. జిల్లా డ్రగ్ డిస్పోజల్ కమిటీ చైర్మన్ జిల్లా ఎస్పీ మరియు కమిటీ సభ్యులైన అదనపు ఎస్పీ ఎ.సంజీవరావు, మెడీకేర్ పరిశ్రమ మేనేజర్ శివారెడ్డి పటాన్ చెర్వు డియస్పి రవీందర్ రెడ్డి, సంగారెడ్డి డియస్పి సత్యయ్యగౌడ్, డీసిఆర్బీ ఇన్స్పెక్టర్ బి.రమేష్, పటాన్ చెర్వు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ లాలూనాయక్ ఆధ్వర్యంలో దహనం చేయడం జరిగింది.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. యన్.డి.పి.యస్. యాక్ట్ లోని నియమనిబంధనల ప్రకారం జిల్లాలోని పలు పోలీస్ స్టేషన్లలో నమోదు చేయనడిన 13 కేసులలో నిల్వ ఉన్న ఆల్ఫాజోలం మరియు గంజాయిని దహనం చేయడం జరిగిందని తెలియజేసారు. కొందరు అక్రమార్జనలో భాగంగా అక్రమ ఆల్ప్రాజోలం తయారీ, గంజాయి సాగు, విక్రయిస్తూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని యువతను ప్రలోభాలకు గురి చేస్తూ మత్తులోకి దించుతున్నారన్నారు.

అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడే వారిని అరికట్టడం కోసం జిల్లా వ్యాప్తంగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ పోలీసుల ద్వారా విస్తృత స్థాయిలో తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఎవరైనా గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాలను విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇకపై మత్తుకు బానిసలై గంజాయి లాంటి మత్తు పదార్థాలను సేవించే వారిపై కూడా కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని హెచ్చరించారు.

# కొండకల్ రేడియల్ రోడ్ లో రెండు కార్లు ఢీ... ముగ్గురికి గాయాలు



**శంకరపల్లి :ఆగస్ట్ 29: (డైలీ రిపోర్ట్ )**శంకర్ పల్లి మండలంలోని కొండకల్ మరియు మోకిల, మధ్యలో ఏర్పాటు చేస్తున్న రేడియల్ రోడ్డుపై, జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లలో ప్రయాణం చేస్తున్న ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు, స్థానికులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి, శంకర్ పల్లి గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన స్విఫ్ట్ డిజైర్ కార్ లో కొల్లూరు వైపు వెళుతూ ఉండగా, ఎదురుగా ఇద్దరు ప్రయాణికులతో వస్తున్న ఊబర్ వాహనం స్విఫ్ట్ డిజైర్ ను ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది, ఉబర్ లో ప్రయాణం చేస్తున్న ఒకరికి కాలు విరుగగా మరొకరు చిన్న గాయంతో బయటపడ్డారు, స్విఫ్ట్ డిజైర్ లో ఉన్న వ్యక్తికి ఎటువంటి ఇబ్బంది కలగలేదు, రెండు వాహనాలలో ప్రయాణిస్తున్న ముగ్గురిని పటాన్ చెరువు ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్ లో తరలించారు, రోడ్డుపై ప్రమాదం జరగడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది, మోకిల పోలీసులు రోడ్డుపై ప్రమాదంలో ధ్వంసమైన రెండు కార్లను రోడ్డుపై నుండి తొలగించి ట్రాఫిక్ ను పూర్తిగా క్లియర్ చేశారు, మొకిల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.